క్లుప్తంగా

దుర్గాలమ్మ సన్నిధిలో అన్నప్రసాద వితరణ



అన్న ప్రసాదం అందిస్తున్న కమిటీ సభ్యులు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి శుక్రవారం అన్న దానంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో చంద్రంపాలెం వాస్తవ్యులు దివంగత వాండ్రాసి పెంటయ్య కుమారులు వాండ్రాసి అప్పారావు, కనకావు, శ్రీను, పైడికొండ, కుటుంబసభ్యుల సహాయ సహకారాలతో 450మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి



మాట్లాడుతున్న విశ్రాంత అధ్యాపకుడు ఉపేంద్ర

భీమునిపట్నం: విద్యార్థులందరూ లక్ష్యాన్ని నిర్ధారించుకుని, అందుకనుగుణంగా చదవాలని విశ్రాంత అధ్యాపకులు ఉపేంద్ర అన్నారు. అప్పుడే విజయం సాధించగలరన్నారు. భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద శుక్రవారం కొత్తగా వచ్చిన మొదటి సంవత్సరం విద్యార్థులను కలుసుకునే దీక్షారంభ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రస్తుత కళాశాలలో వసతులు వినియోగించుకుని, ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు, సేవలపై ఆరా



డాక్టర్ ఫణికుమార్‌తో మాట్లాడుతున్న వినియోగదారుల సంఘ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిని భీమిలి వినియోగదారుల సంఘ సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధాన వైద్యులు ఫణికుమార్‌తో సంఘం అధ్యక్షులు కె.ఎస్.నాయుడు మాట్లాడారు. ఇక్కడ రోగులకు అందిస్తున్న సేవలు, వసతులపై ఆరా తీశారు. అలాగే మందులు ఏమేరకు ఉన్నాయి, వివిధ రకాలైన పరీక్షల గురించి ప్రధాన వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు టి.భీమారావు, మైలపల్లి లక్ష్మణరావు, జోగారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే అందరూ క్షేమం



కొమ్మాది జంక్షన్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు, విద్యార్థులు

మధురవాడ: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వలన వాహనం నడిపే వారితో పాటు ఇతర ప్రయాణికులు, వాహన చోదకులకు కూడా ఎంతో మేలు జరుగుతుందని పీఎం పాలెం ట్రాఫిక్ సీఐ సాయి పేర్కొన్నారు. కొమ్మాది జంక్షన్ సిగ్నల్ వద్ద జీవీఎంసీ విద్యార్థులతో కలిసి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వలన కలిగే ప్రయోజనాలు తెలియజేశారు.

ఓక్రిడ్జ్‌లో 'కర్టెన్స్ ఆఫ్ ఫర్ ఏ కాజ్'



దీపావళి సామగ్రి విక్రయిస్తున్న ఓక్రిడ్జ్ విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ఇంటర్నేషనల్ బాకలారియేట్ డిప్లమా ప్రోగ్రాం(ఐబీడీపీ-2026) విద్యార్థులు శుక్రవారం కర్టెన్స్ ఆఫ్ ఫర్ ఏ కాజ్ పేరుతో ఛారిటీ ఫండ్ రైజింగ్ నిర్వహించారు. 20 మందికి పైగా విద్యార్థులు స్టాళ్లు ఏర్పాటు చేసి దీపావళి వస్తువులు, రుచికరమైన ఆహారపదార్థాలు, చేతివృత్తుల ఉత్పత్తులు విక్రయించారు. ఈ ఫండ్ రైజింగ్ ద్వారా వచ్చిన మొత్తంతో విద్యార్థుల నాటక ప్రదర్శన నిర్వహిస్తారు. ఈ ప్రదర్శన ద్వారా వచ్చిన మొత్తాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నట్టు ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల తెలిపారు.

దీపావళి అనగానే మట్టిప్రమిదల వెలుగులు.. టపాసుల మోత, చిచ్చుబుడ్డీల కాంతులే గుర్తొస్తాయి. కొన్నేళ్ల కిందట ఈ వెలుగుల పండగ సందడే వేరుగా ఉండేది. పిండివంటల ఘుమఘుమలు, గుమ్మాల ముందు ప్రమిదలు, దివిటీలు తిప్పుతూ చేసే విన్యాసాలతో అంతటా ఉత్సాహం నెలకొనేది. మట్టి ప్రమిదలు, చిచ్చుబుడ్ల తయారీతో కుమ్మరి వృత్తిదారులకు చేతి నిండా పని ఉండేది. కాలక్రమంలో మట్టి దీపాల వాడకం తగ్గి, కుమ్మరుల జీవితాల్లో వెలుగులు సన్నగిల్లాయి. ఎంతోమంది ఈ వృత్తిని వదిలేశారు. అయినా సరే.. తమ పూర్వీకుల కళపై, వృత్తిపై మమకారాన్ని చంపుకోలేక.. ఆ కళను బతికించుకోవాలని తపిస్తున్న కొన్ని కుటుంబాలు నేటికీ ఉన్నాయి. దీపావళి నేపథ్యంలో భీమిలి నియోజకవర్గంలో అలాంటి కుమ్మరి కుటుంబాలు.. మట్టి ప్రమిదలు, చిచ్చుబుడ్డీలను తయారు చేస్తూ.. తమ జీవితాల్లో దీపకాంతిని నింపుకొనే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నాయి.

కులవృత్తికి జీవం.. వెలుగుల్లేని జీవనం

కుమ్మర్ల జీవనచిత్రం



కుమ్మరిసారెపై ప్రమిదలు తయారు చేస్తున్న కుమ్మరి



ఎండలో ఆరబెట్టిన ప్రమిదలు



ఆవంలో కాల్చిన ప్రమిదలు



విజయనగరం నుంచి దిగుమతి చేసుకున్న మట్టిపొయ్యిలు

తగరపువలస: దీపావళి సమీపించడంతో మట్టి ప్రమిదలు, చిచ్చుబుడ్ల తయారీలో కుమ్మర్లు నిమగ్నమయ్యారు. గతంలో భీమిలి నియోజకవర్గంలో తాటితూరు, పాండ్రంగి, పొట్నూరు, సంతపేటలో వందలాది మంది ఈ వృత్తిలో కొనసాగేవారు, ప్రస్తుతం వీరి సంఖ్య పదులకు పడిపోయింది. దీంతో మట్టిపాత్రలు తయారు చేసిన చోటే విజయనగరం నుంచి దిగుమతి చేసుకుని కొద్దిమంది వ్యాపారం చేస్తున్నారు. దీపావళి రోజు ప్రతిష్ఠించి నాగులచవితి రోజు నిమజ్జనం చేసే గౌరమ్మ బొమ్మలు ఒక్క తాటితూరులోనే ఏడాదిలో మూడు వరకు తయారు చేస్తారు.

మట్టే బంగారమాయె..

గతంలో కుమ్మర్లకు భూస్వాములు ఉచితంగా మట్టి ఇచ్చేవారు, చెరువుల నుంచి కూడా తీసుకునేవారు. ప్రస్తుతం భూములన్నీ ప్లాట్లుగా మారిపోవడం.. చెరువులు కబ్జాకు గురవడం, కలుషితం కావడంతో దూర ప్రాంతాల నుంచి మట్టి కొనుక్కుని తీసుకువస్తున్నారు. భీమిలి మండలం తాటితూరు, పద్మనాభం మండలం పాండ్రంగి, జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేటలో వృత్తిపనులు చేసేవారు ప్రస్తుతం ఆనందపురం మండలం శొంఠ్యాం, పెందుర్తి నియోజకవర్గంలోని గుర్రంపాలెం నుంచి వేలాదిరూపాయలు చెల్లించి ట్రాక్టర్ల ద్వారా మట్టి దిగుమతి చేసుకుంటున్నారు. రెడీమేడ్ చిచ్చుబుడ్లు మార్కెట్‌ను ముంచెత్తడంతో ప్రస్తుతం ప్రమిదలు, ఒకరో ఇద్దరో గౌరమ్మ బొమ్మలు తయారు చేస్తున్నారు. 2014-19 టీడీపీ పాలనలో ఆదరణ-2 పథకం కింద కుమ్మర్లుకు ఎలక్ట్రానిక్ సారెలు ఇస్తామని రూ.1700 వంతున డీడీలు కట్టించుకుని ఇవ్వలేదని కుమ్మర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా తమకు చేయూతనందించాలని కోరుతున్నారు.

రోజుకు వెయ్యి ప్రమిదల తయారీ

ప్రమిదలు తయారు చేసేవారు ఏకంగా 3 నుంచి 5 మాసాల పాటు ఈ పనిలో ఉంటారు. రోజుకు వెయ్యి వంతున కుమ్మరిసారెపై తయారు చేసి దీపావళి సమీపిస్తున్న తరుణంలో హోల్‌సేల్‌గా వంద ప్రమిదలు రూ.70 వంతున దొండపర్తి, పూర్ణా మార్కెట్, మధురవాడ ప్రాంతాల వ్యాపారులకు విక్రయిస్తారు. చిల్లర వ్యాపారులు డజను రూ.25 నుంచి రూ.100 వరకు డిమాండ్‌ను బట్టి విక్రయిస్తారు.

తగ్గిపోయిన వృత్తిదారులు

సమాజంలో భాగమైన కుమ్మర్లు గతంలో గ్రామాలను నమ్ముకుని మట్టిపాత్రలు తయారు చేసి, చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయాలు చేసుకుని జీవనం సాగించేవారు. వంట పాత్రలు మొదలుకుని నీళ్లు దాచుకోవడానికి కుండలు, గోళాలు, వంటకు మట్టిపొయ్యిలు, అన్నం వార్చుకోవడానికి మూతలు, దేవునికి సాంబ్రాణి వేయడానికి కుటకలు అన్నీ మట్టితోనే చేసేవారు. సీజన్‌లలో కల్లు కుండలు, రజకులు బట్టలు ఉతుకుకోవడానికి బానలు చేసేవారు. దీపావళి వంటి పండగ సమయంలో ప్రమిదలు, చిచ్చుబుడ్లు, గౌరమ్మ ప్రతిమలు చేసి నాలుగు రాళ్లు వెనకేసుకునేవారు. ప్రస్తుతం ఆధునిక పోకడల కారణంగా వంట పాత్రలకు అల్యూమినియం, నీళ్లు దాచుకోవడానికి ప్లాస్టిక్ డ్రమ్ములు, స్టీల్ కేన్‌లు, సాంబ్రాణి వేసుకోవడానికి స్టీల్, కల్లు కుండల ప్రదేశంలో ప్లాస్టిక్ సీసాలు ఆక్రమించాయి. అలాగే గిట్టుబాటు కాని ధరల కారణంగా పలువురు ఈ వృత్తికి గుడ్‌బై చెప్పారు. చదువుకున్నవారు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల వైపు వెళ్లిపోగా చదువుకోని వారు భవన నిర్మాణ, ఇటుకబట్టీల కార్మికులుగా దారి చూసుకున్నారు.



పాండ్రంగి నుంచి దిగుమతి చేసుకున్న కుండలు



కొద్దిగా తయారు చేసిన చిచ్చుబుడ్లు

పదో వంతే మిగిలాం



40 సంవత్సరాల క్రితంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఈ వృత్తిపనిలో పదోవంతు మాత్రమే మిగిలారు. వీరిలో చాలామందికి కుండల తయారీ రాదు. రెడీమేడ్ రాకతో చిచ్చుబుడ్ల కొనుగోలు తగ్గిపోయింది. నేను మాత్రం గౌరమ్మ బొమ్మలు ఆర్డర్ తీసుకుని నెలరోజుల వ్యవధిలో మూడు బొమ్మలు మాత్రం చేస్తాను.

– ఎలుసూరి చిన్న, తాటితూరు

6 మాసాలు ఇటుకబట్టీల్లో పనులకు..



మాలో చాలావరకు కార్తీక పౌర్ణమి తరువాత 6 మాసాలు ఇటుక బట్టీలలో పనులకు వెళ్తుంటాం. బూడిద, రసాయనాల కారణంగా ఈ వృత్తిలో ఉన్నవారికి చూపు మందగిస్తుంది. రానున్న కాలంలో మట్టి దొరకక ఈ వృత్తి కనుమరుగవుతుంది. ప్రభుత్వం స్పందించి, కుమ్మరి వృత్తిపని చేసేవారికి మత్స్యకారులు, ఉప్పు గల్లీలలో పనిచేసే వారి మాదిరిగా 50 ఏళ్లకే పెన్షన్లు ఇవ్వాలి.

– పొట్నూరు అప్పలరాజు, తాటితూరు

ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు ఇవ్వాలి



చాలామంది చదువుకోని కారణంగా వంశపారంపర్యంగా వస్తున్న ఈ వృత్తిని కొనసాగిస్తున్నారు. మరికొందరు తయారీ రాకపోవడవంతో విజయనగరం నుంచి మట్టి పాత్రలు, చెన్నై నుంచి రంగురంగుల పాత్రలు తీసుకువచ్చి ఉపాధి పొందుతున్నారు. రానురాను ఈ వృత్తి పూర్తిగా కనుమరుగవుతుంది. ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు ఇచ్చి ఈ వృత్తిని బతికించాలి. ఇటుక బట్టీలకు వెళ్లే వెయ్యి ఇటుకలకు రూ.1000 ఇస్తారు.

– తాటిపూడి రమణ, తాటితూరు

రెండో వార్డులో సంతకాల సేకరణ



సంతపేటలో సంతకాలు సేకరిస్తున్న రెండో వార్డు నాయకులు

తగరపువలస: కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దిశగా వేస్తున్న అడుగులను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ పిలుపు ఇచ్చిన కోటి సంతకాల సేకరణను శుక్రవారం జీవీఎంసీ 2వ వార్డు నాయకులు చేపట్టారు. సంతపేటలో జరిగిన కార్యక్రమంలో ఇంటింటా తిరిగి, మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ వలన కలిగే నష్టాలను వివరిస్తూ సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు అక్కరమాని మంగరాజు, జీరు వెంకటరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిప్పాడ వెంకటేష్, నీలాపు సురేష్ రెడ్డి, ఉప్పాడ అప్పలరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, చేట్ల ఎర్రయ్యరెడ్డి, జీరు వేణుగోపాలరెడ్డి, చేట్ల ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లు వినియోగిస్తే జరిమానా

భీమునిపట్నం: భీమిలి జోన్ పరిధిలో వ్యాపారులెవరైనా పాలిథిన్ కవర్లను వినియోగిస్తే జరిమానాలు విధిస్తామని జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు శుక్రవారం తెలిపారు. అలాగే, దుకాణాల వద్ద చెత్తబుట్టలు తప్పనిసరిగా ఉండాలని, లేకపోతే వెయ్యి నుంచి అయిదువేల రూపాయల వరకు జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. అన్ని షాపులకు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పని సరిగా ఉండాలని, లేకపోతే షాపులను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

డిప్యూటీ ఎంపీడీవోగా రమణ బాధ్యతల స్వీకరణ



పద్మనాభం: మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవోగా బీవీ రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పెందుర్తి మండలంలో గ్రేడ్ -1 సెక్రటరీగా పనిచేసి, పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన డిప్యూటీ ఎంపీడీవోగా పని చేసిన మీనాకుమారి ఎంపీడీవోగా పదోన్నతిపై అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లడంతో, ఆమె స్థానంలో రమణ బాధ్యతలు స్వీకరించారు.

క్రీడలతో పోరాట స్ఫూర్తి



ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ శారదా ప్రియాంక



పద్మనాభంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

తగరపువలస: క్రీడలు పోరాటస్ఫూర్తిని కలిగించడమే కాకుండా ప్రాంతీయ అసమానతలు తొలగిస్తాయని ఆనందపురం ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక అన్నారు. ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మండల స్థాయి అండర్-14, 17 బాలుర, బాలికల క్రీడా పోటీలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. బాలురకు కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, వాలీబాల్, త్రోబాల్ వంటి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు, భాస్కరరావు, ముత్యాలరాయుడు, శంకరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహమూర్తి, ప్రసాద్, బుజ్జి ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, కోరాడ రాజబాబు, ఎంపీటీసీ కొట్యాడ రమాదేవి, ఏఎంసీ చైర్మన్ లక్ష్మి, ఎంఈవోలు జోగేంద్రరావు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పద్మనాభం: క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. కృష్ణాపురంలోని కస్తూర్బా విద్యాలయంలో ఎస్‌జీఎఫ్ బాలికల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవోలు పి.రమణ, ఎస్సీ బాబూలాల్, పాండ్రంగి హైస్కూల్ హెచ్ఎం ఆర్వీ గిరి, కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

దీక్షాపరులకు మహా నారాయణసేవ



మహా నారాయణసేవ ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట రామాలయంలో దీక్షాపరులకు శుక్రవారం మహా నారాయణసేవ ప్రారంభించారు. 41 రోజుల పాటు జరగనున్న కార్యక్రమంలో భీమిలి చుట్టుపక్కల గ్రామాల నుంచి అయ్యప్పస్వాములు, భవానీలు, శివస్వాములకు రోజూ మధ్యాహ్నం భిక్ష అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గురుస్వామి ఆకెళ్ల గణేష్‌శర్మ, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు పాల్గొన్నారు. గురుస్వాములు గాడు అప్పలనాయుడు, కరుభుక్త ఈశ్వర్, గాడు సన్యాసినాయుడు, సురాల సత్యనారాయణ ఈ సేవ అందించనున్నారు.

- ఈ నెల 22 నుంచి లక్ష్మీపురం అయ్యప్పస్వామి సేవాపీఠంలో మహానారాయణసేవ ప్రారంభమవుతుందని పీఠం వ్యవస్థాపక ధర్మకర్త గాడు తాతినాయుడు తెలిపారు. మహా నారాయణసేవ పోస్టర్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు.

శొంఠ్యాంలో బాణసంచా, ముడిపదార్థాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బాణసంచా, ముడి పదార్థాలు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీలో గురువారం రాత్రి స్పెషల్ బ్రాంచ్, ఆనందపురం పోలీసులు సంయుక్తంగా దాడి చేసి గొడౌన్‌లో నిల్వ చేసిన బాణసంచా, బాణసంచా తయారీలో వినియోగించే ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. చల్లా గురమ్మ(40) అనే మహిళపై కేసు నమోదు చేశారు. బాణసంచా దుకాణాల ఏర్పాటు, విక్రయాలలో నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. ఎవరైనా అనధికరంగా బాణసంచా నిల్వ చేసినట్టు తెలిస్తే 100, 112, 7995095799 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

నిరాటంకంగా తాగునీరు సరఫరా చేయాలి

పద్మనాభం: ప్రజలకు తాగు నీరు నిరాటంకంగా సరఫరా చేయాలని ఎంపీడీవో కె.రూపేష్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజూ తాగు నీరు సరఫరా చేయాలని, రక్షిత మంచి నీటి పథకాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ట్యాంకులకు క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో జయ ఉమ పాల్గొన్నారు.

అనంతుని ఆలయంలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పద్మనాభం: మండలంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశన, అగ్ని మథనం, అగ్ని ప్రతిష్ఠాపన, నిత్య హోమాలు వంటి పూజా కార్యక్రమాలు జరిగాయి. రాత్రి మూలమంత్ర హోమం, పవిత్రాల అభిమంత్రణ నిర్వహించారు. పవిత్రాలపై నీళ్లు జల్లి, శుసుపు రాసి శుద్ధి చేశారు. హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, తాలాడ పద్మనాభం, బుగత రాము, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

'దళితుల భూములు బలవంతంగా తీసుకోవద్దు'



దళిత రైతుల నుంచి వివరాలు తీసుకుంటున్న కేవీపీఎస్ ప్రతినిధులు

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీలో దళితుల భూములను బలవంతంగా తీసుకుని గూగుల్‌టెక్‌కు కేటాయించవద్దని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి కోరారు. శుక్రవారం ఆయన తర్లువాడ దళితవాడలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుబ్బన్న, చిరంజీవితో కలిసి పర్యటించి బాధితులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పచ్చని భూములను ఐటీ సంస్థలకు కేటాయించి, గ్రామాలను వల్లకాడుగా మారుస్తోందని ఆరోపించారు. కలెక్టర్ దళితులను తన చాంబర్‌కు పిలిపించి, భూములు ఇవ్వకపోతే బలవంతంగా లాక్కుంటామని బెదిరించడం సరికాదన్నారు. దళితులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

విజేతలకు అభినందన

మధురవాడ: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలలో మధురవాడకు చెందిన ఇద్దరు క్రీడాకారులు పతకాలు సాధించారు. ఇటీవల రేపల్లెలో జరిగిన పోటీల్లో అండర్-14 విభాగంలో మధురవాడ యూత్ తైక్వాండోకి చెందిన మద్దు గాయత్రి బంగారు, పిళ్లా సుధీర్ రజత పతకాలు గెలుచుకుని జాతీయస్థాయికి ఎంపికయ్యారని కోచ్‌లు సురేష్, సుకుమార్ సంపత్ తెలిపారు. శుక్రవారం మధురవాడలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో నాయకులు కె.జగన్నాథ్, సురేష్ తదితరులు అభినందించారు.

చిరు వ్యాపారుల ఆందోళన



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న చిరు వ్యాపారులు

మధురవాడ: జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది రోడ్డు పక్కన బతుకుతున్న చిల్లర వర్తకులపై దాడులు చేసి, వారు అమ్మకానికి తెచ్చుకుంటున్న సరకులు, సామగ్రి ఎప్పటికప్పుడు పట్టుకుపోతున్నారని పలువురు చిరువ్యాపారులు వాపోయారు. మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద సీఐటీయూ అనుబంధ విశాఖ జిల్లా చిల్లర వర్తలకులు, తోపుడు బండ్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. సంఘం నాయకుడు పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ జీవీఎంసీ దాడులతో చిరువ్యాపారుల బతుకులు దినదినగండంగా మారుతున్నాయన్నారు. ఒకవైపు ఉపాధి కోల్పోయి, మరోవైపు ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళనల మధ్య సతమతమవుతున్నారన్నారు. మిథిలాపురి వుడాకాలనీ రోడ్డు మార్జిన్‌లో ఎవరికీ ఇబ్బంది లేకుండా వ్యాపారాలు చేసుకుంటున్న వారిని కూడా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. అప్పులు చేసి తెచ్చుకున్న సరుకులు ఎత్తుపోవడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆదినారాయణ, రఘు, వరలక్ష్మి, ధనుంజయరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం..కార్తీక దామోదరోత్సవం



ఇస్కాన్‌లో హారతి ఇస్తున్న సాంబదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని



హరేకృష్ణ వైకుంఠంలో నెయ్యి దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో కార్తీక దామోదర మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.స్వామికి మంగళహారతి, నర్సింహ హారతి, తులసిహారతి, నేతిదీపం సమర్పించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని ఆధ్వర్యంలో దామోదరాష్టకం పఠించారు.

హరేకృష్ణ వైకుంఠంలో..

తగరపువలస: ఆనందపురం మండలం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో దామోదరునికి భక్తులు నెయ్యి దీపాలు, హారతులను సమర్పించారు. యదురాజా దాస దామోదర వ్రతం విశిష్టతను వివరించారు. అంబరీష దాస పాల్గొన్నారు.

వాహనం ఢీకొని ముఠా కార్మికుడికి తీవ్రగాయాలు

తగరపువలస: చెరకుపల్లి అవంతి కళాశాల రోడ్డులో గురువారం రాత్రి 11 గంటల సమయంలో పల్సర్ ద్విచక్రవాహనం ఢీకొని భోగాపురం మండలం కొత్త చెరకుపల్లి గ్రామానికి చెందిన రిక్క ఈశ్వరరెడ్డి(45)అనే ముఠా కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. నగరంలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈశ్వరరెడ్డికి ఈ ప్రమాదంలో కాలు విరిగిపోగా శస్త్ర చికిత్స చేయవలసి ఉంది. పద్మనాభం మండలం రౌతులపాలెం గ్రామానికి చెందిన ద్విచక్రవాహనదారుడు ప్రమాదం అనంతరం వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయాడు. చెరకుపల్లి వాసులు క్షతగాత్రుని చికిత్స కోసం సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు.

చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



చేతుల శుభ్రతపై మజ్జిపేట హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మ్యాజిక్ బస్ ప్రతినిధులు

పద్మనాభం/తగరపువలస: చేతుల పరిశుభ్రతపై మ్యాజిక్ బస్ ప్రతినిధులు భీమిలి మండలం మజ్జిపేట హైస్కూల్, పద్మనాభం మండలం బీఆర్ తాళ్లవలస హైస్కూళ్లలో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మ్యాజిక్ బస్ ట్రైనింగ్ కం మానిటరింగ్ అధికారి డి.రమేష్ మాట్లాడుతూ చేతులు నిత్యం శుభ్రం చేసుకోవడం ద్వారా పరిపూర్ణమైన ఆరోగ్యం పొందవచ్చన్నారు. ఏడు పద్ధతుల్లో హ్యాండ్‌వాషింగ్ గురించి తెలియజేశారు. విద్యార్థులకు మెడిమిక్స్ సబ్బులు, హ్యాండ్ వాషింగ్ లిక్విడ్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమాల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బండారు అప్పలరాజు, జయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.